ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక





## నేటి నుంచి టీజీ పేరుతో వాహన రిజిస్ట్రేషన్లు

మంత్రి పొన్నం ప్రభాకర్ 2లో..


సంపుటి: 1 | సంచిక: 339 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 15 మార్చి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్


# కాంగ్రెస్‌లోకి జితేందర్ రెడ్డి?



### బీజేపీ నేత జితేందర్ రెడ్డి ఇంటికి సీఎం రేవంత్
### కమలం పార్టీకి షాక్ తప్పదా..?
### తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం

హైదరాబాద్, మార్చి 14 (ప్రభాత ఉదయం): పార్లమెంట్ ఎన్నికల వేళ తెలంగాణలో ఆసక్తికర పరిణమాలు చోటు చేసుకుంటన్నాయి. మహబూబ్‌నగర్ టికెట్ ఆశించి భంగపడ్డ బీజేపీ నేత, మాజీ ఎంపీ ఏపీ జితేందర్ రెడ్డి ఇంటికి సీఎం రేవంత్ వెళ్లారు. కమలం పార్టీ టికెట్ కేటాయించకపోవటంతో అసంతృప్తిలో ఉన్న జితేందర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి రావాలని రేవంత్ ఆహ్వానించినట్లు తెలిసింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డితో కలిసి స్వయంగా జితేందర్ రెడ్డి ఇంటికి వెళ్లిన సీఎం.. ఆయనతో రాజకీయ అంశాలపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీలోకి రావాలని తగిన గౌరవం ఇస్తామని జితేందర్ రెడ్డికి హామీ ఇచ్చినట్లు ..మిగతా 2లో

## గ్రూప్-1 దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగింపు

హైదరాబాద్, మార్చి 14 (ప్రభాత ఉదయం): తెలంగాణలో గ్రూప్-1 పోస్టుల దరఖాస్తు గడువును టీఎస్‌పీఎస్సీ పొడిగించింది. అభ్యర్థులకు మరో రెండు రోజులపాటు దరఖాస్తులు అవకాశం ..మిగతా 2లో



## సీఏఏను ఎన్నటికీ వెనక్కి తీసుకోబోం
### అమిత్ షా స్పష్టీకరణ

న్యూఢిల్లీ, మార్చి 14 (ప్రభాత ఉదయం): సార్వత్రిక ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై ప్రతిపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రతిపక్ష కాంగ్రెస్ సహా తృణమూల్, సీపీఐ, ఆప్, సమాజ్‌వాదీ, డీఎంకే తదితర పార్టీలు ఈ చట్టాన్ని ఇప్పటికే ..మిగతా 2లో

## డీఎస్సీకి ముందే టెట్
### టెట్ నిర్వహణకు రేవంత్ సర్కార్ గ్రీన్ సిగ్నల్



హైదరాబాద్, మార్చి 14: మెగా డీఎస్సీకి ముందే టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు డీఎస్సీకి ముందే టెట్ ..మిగతా 2లో

### తెలంగాణలో నేటి నుంచి
## ఒంటిపూట బడులు



2

### మల్కాజ్‌గిరి, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థులను
# ప్రకటించిన బీఆర్ఎస్





హైదరాబాద్, మార్చి 14 (ప్రభాత ఉదయం): మరో రెండు లోక్‌సభ స్థానాలకు బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించింది. ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సక్కును ప్రకటించగా.. మల్కాజ్‌గిరి ఎంపీ స్థానానికి రాగిడి లక్ష్మారెడ్డి పేరును ఫైనల్ చేసింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వీరిద్దరి పేర్లను అధికారికంగా గురువారం వెల్లడించింది బీఆర్ఎస్. దీంతో పార్లమెంట్ ఎన్నికలకు ఇప్పటి వరకు బీఆర్ఎస్ 11 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. కాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ ముఖ్య నేతలతో ఆ పార్టీ అధినేత కేసీఆర్ భేటీ అయ్యారు.. నందినగర్‌లోని తన నివాసంలో జరిగిన ఈ సమావేశంలో రానున్న లోక్ సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, శ్రేణులను ఎన్నికలకు ..మిగతా 2లో

## డీకే శివకుమార్‌తో మల్లారెడ్డి భేటీ
### కాంగ్రెస్‌లో చేరేందుకు మల్లారెడ్డి ప్రయత్నం?

హైదరాబాద్, మార్చి 14 (ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డితో వారు సమావేశం అయ్యారు. అయితే ఆయనను పార్టీలో చేర్చుకునేందుకు రేవంత్ రెడ్డి అంగీకరించలేదని తెలుస్తోంది. దీంతో ఆయన డీకే శివకుమార్ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. మల్లారెడ్డి , ఆయన కుమారుడు బెంగళూరు వెళ్లి డీకే శివకుమార్ ను కలిశారు. ఈ ఫోటో బయటకు రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మల్లారెడ్డి రాజకీయ భవిష్యత్ ప్రమాదంలో ..మిగతా 2లో






# సీఏఏను ఎన్నటికీ వెనక్కి తీసుకోబోం

మొదటి పేజీ తరువాయి...




వ్యతిరేకించాయి. తమ రాష్ట్రాల్లో ఈ చట్టాన్ని అమలు చేయబోమని స్పష్టం చేస్తున్నాయి. ఈ చట్టాన్ని కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్లు కూడా వెల్లువెత్తున్నాయి. పలువురు ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో సీఏఏ అంశంపై కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా తాజాగా స్పందించారు. సీఏఏను ఎప్పటికీ వెనక్కి తీసుకోబోమని స్పష్టం చేశారు. రాజ్యాంగం ప్రకారం ఏ దేశ ముస్లింలైనా భారతీయ పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అయితే, ఇప్పుడు తీసుకొచ్చిన చట్టం మాత్రం విభజన కారణంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల్లో మతపరమైన హింసను ఎదుర్కొంటూ భారతదేశానికి రావాలని నిర్ణయించుకున్న ముస్లిమేతర మైనారిటీల కోసం ఉద్దేశించినదని షా వెల్లడించారు. ఇదే సందర్భంలో విపక్షాలపై అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రతిపక్షాలకు ఏ పనీ లేదని అన్నారు. సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్‌ను కూడా స్వార్థ రాజకీయాల కోసం చేసినట్లు వారు విమర్శిస్తుంటారని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోకూడదా..? అని షా ప్రశ్నించారు. ఆర్టికల్ 370 రద్దును కూడా రాజకీయ లబ్ధి కోసం చేసినట్లు ప్రతిపక్షాలు పేర్కొన్నాయని అమిత్ షా మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే చట్టాన్ని ఉపసంహరిస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని అన్నారు. వారు ఎన్నటికీ అధికారంలోకి రాలేరని, మోదీ సర్కారు తీసుకొచ్చిన ఈ చట్టాన్ని రద్దు చేయడం అసాధ్యమని షా పేర్కొన్నారు. భారత పౌరసత్వం కోసం అందరికీ తలుపులు తెరిచే ఉన్నాయని ఈ సందర్భంగా అమిత్ షా పేర్కొన్నారు. సీఏఏ రాజ్యాంగ విరుద్ధమని విపక్షాలు చేస్తున్న వాదనలో వాస్తవం లేదన్నారు. అది ఆర్టికల్ 14కు ఎలాంటి భంగం కలిగించదని వెల్లడించారు. ఈ చట్టంపై దేశవ్యాప్తంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొన్నది. నాలుగేండ్ల కిందట ఆమోదం పొందిన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం-2019 (సీఏఏ)ను తాజాగా అమల్లోకి తీసుకొచ్చింది. ఈ మేరకు సోమవారం సాయంత్రం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే అర్హులైన వారు భారత పౌరసత్వం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఓ పోర్టల్‌ను కూడా ప్రారంభించారు. https://indiancitizenshiponline.nic.in వెబ్ పోర్టల్‌ను కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ మంగళవారం అందుబాటులోకి తెచ్చింది.



## కాంగ్రెస్‌లోకి జితేందర్ రెడ్డి?

మొదటి పేజీ తరువాయి...

తెలిసింది. అయితే త్వరలోనే తన నిర్ణయం చెబుతానని జితేందర్ రెడ్డి వెల్లడించినట్లు తెలిసింది. ఒకవేళ జితేందర్ రెడ్డి పార్టీ మారితే పార్లమెంట్ ఎన్నికల ముందు కమలం పార్టీకి ఎదురుదెబ్బే అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కాగా, 2014లో టీఆర్ఎస్ పార్టీ నుంచి మహబూబ్‌నగర్ స్థానం నుంచి ఎంపీగా గెలిచిన జితేందర్ రెడ్డి ఆ తర్వాత 2019 ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. అప్పటి నుంచే బీజేపీలో కొనసాగుతున్న ఆయన 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందే పార్టీని వీడుతారని ప్రచారం జరిగింది. అయితే ఆయన బీజేపీలోనే కొనసాగటంతో పాటు మహబూబ్‌నగర్ బీజేపీ ఎమ్మెల్యే టికెట్‌ను తన కుమారుడు మిథున్ రెడ్డికి ఇప్పించుకున్నారు. అయితే మిథున్ రెడ్డి ఓటమి పాలయ్యారు. ఇక పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ సీటు తనకు మరోసారి ఇవ్వాలని జితేందర్ రెడ్డి పట్టుబడ్డారు. అయితే బీజేపీ అధిష్ఠానం మాత్రం డీకే అరుణకు టికెట్ కేటాయించింది. దీంతో జితేందర్ రెడ్డి తీవ్ర అసంతృప్తికి గురైనట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఆయన పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అందులో భాగంగానే సీఎం రేవంత్ జితేందర్ రెడ్డి ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించగా.. ఆయన సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రేపోమాపో ఆయన బీజేపీకి గుడ్‌బై చెప్పి హస్తం గూటికి చేరుతారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.


## డీకే శివకుమార్‌తో మల్లారెడ్డి భేటీ

మొదటి పేజీ తరువాయి...

పడింది. ఆయనకు మెడికల్ కాలేజీలు, ఇంజినీరింగ్ కాలేజీలతోపాటు ఇతర వ్యాపారాలు, ఆస్తులు ఉన్నాయి. వీటికి సంబంధించి ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. కేసులు కూడా నమోదవుతున్నాయి. మూడు రోజుల కిందట తమ కాలేజీ కోసం ప్రభుత్వ భూమి ఆక్రమించి నిర్మించిన రోడ్డును అధికారులు తొలగించారు. తర్వాత మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి చెరువును ఆక్రమించి కట్టిన ఇంజినరింగ్ కాలేజీ భవనాలను కూలగొట్టారు. మొదటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉన్న రాజకీయ వైరం, గతంలో రేవంత్ రెడ్డిపై ఘాటైన పదజాలంతో వ్యాఖ్యలు చేయడంతో మల్లారెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు ఎవరూ ఆసక్తి చూపించలేదు. అయితే మల్లారెడ్డి కర్నాటక రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ కీలక నేతతో రాయబారం నడిపానని కాంగ్రెస్ లో చేర్చుకునేందుకు అంగీకరించారని ఆయన చెబుతూ వస్తున్నారు. గతంలో ఎంపీగా, మంత్రిగా మల్లారెడ్డి మేడ్చల్ జిల్లాను తన గుప్పిట్లో పెట్టుకొని భూములను కారు చౌకగా తన పేరిట, అనుచరుల పేరిట కొనుగోలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు వార్తలు వస్తుండటంతో ఆ పార్టీ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మల్లారెడ్డి వైఖరి నచ్చకనే గత ఎన్నికల సమయంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. మొన్నటి ఎన్నికలలో పోటీ చేసిన కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ మల్లారెడ్డి రాకను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మల్లారెడ్డి పార్టీలో చేరడమే కాంగ్రెస్ తరపున తన కుమారుడు భద్రారెడ్డిని మల్కాజిగిరి నుంచి నిలబెడతానని అంటున్నట్లుగా తెలుస్తోంది.

## గ్రూప్-1 దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగింపు

మొదటి పేజీ తరువాయి...




కల్పించింది. అభ్యర్థులు మార్చి 16న సాయంత్రం 5 గంటల వరకు నిర్ణీత ఫీజు చెల్లించి దరఖాస్తులు సమర్పించవచ్చు. డిగ్రీ అర్హత ఉన్నవారు గ్రూప్-1 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అయితే గతంలో టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్ సమయంలో దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరంలేదు. ఎలాంటి ఫీజు కూడా చెల్లించాల్సిన అవసరంలేదు. అభ్యర్థులు దరఖాస్తు ఫీజుగా రూ.320 చెల్లించాలి. ఇందులో అప్లికేషన్ ప్రాసెస్ ఫీజు కింద రూ.200, పరీక్ష ఫీజు కింద రూ.120 చెల్లించాల్సి ఉంటుంది. నిరుద్యోగులకు పరీక్ష ఫీజు నుంచి, ప్రభుత్వ ఉద్యోగులకు దరఖాస్తు ఫీజు నుంచి మినహాయింపు ఉంది. మే/జూన్ నెలల్లో ప్రిలిమ్స్(ఆబ్జెక్టివ్) పరీక్ష, సెప్టెంబరు/అక్టోబరు నెలల్లో మెయిన్ (కన్వెన్షనల్) పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షలకు వారం ముందు నుంచి హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచుతారు. పరీక్ష సమయానికి 4 గంటల ముందువరకు హాల్‌టికెట్లు అందుబాటులో ఉండనున్నాయి. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను జూన్ 9న, మెయిన్స్ అక్టోబర్ 21నుంచి నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు నిరుద్యోగ అభ్యర్థుల నుంచి ఆదరణ తగ్గినట్టుగా కనిపిస్తున్నది. గత నెల 19న గ్రూప్-1 నోటిఫికేషన్ జారీ కాగా, అదే నెల 23 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించారు. మార్చి 14 వరకు దరఖాస్తుల తుది గడువుగా నిర్ణయించారు. అయితే, మార్చి 13 వరకు 2.70 లక్షల మంది అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకొన్నారని టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. పాత గ్రూప్-1 నోటిఫికేషన్ ద్వారా 500 పోస్టులకు భారీగా 3.80 లక్షల దరఖాస్తులు నమోదైనట్టు గతంలో టీఎస్‌పీఎస్సీ అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే.

## మల్కాజ్‌గిరి, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్

మొదటి పేజీ తరువాయి...

సిద్ధం చేయడంపై చర్చించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, మాజీ మంత్రులు వేణుగోపాలచారి, జోగు రామన్న తదితరులు పాల్గొన్నారు. అయితే కేసీఆర్ సమావేశానికి మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి గైర్హాజరయ్యారు. ఈ భేటీలోనే రెండు పార్లమెంట్ స్థానాల అభ్యర్థి ఎంపిక విషయంపై చర్చించినట్లు తెలుస్తోంది. ఇక గత లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేసిన నగేష్ ఇటీవలే బీజేపీలో చేరారు. దీంతో బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ అయిన సోయం బాపురావును కాదని కాషాయ పార్టీ నగేష్‌కు టికెట్ కూడా కేటాయించింది. ఈ నేపథ్యంలో ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు లోక్ సభ టికెట్ కేటాయిస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చింది.

### ఇప్పటి వరకు బీఆర్ఎస్ ప్రకటించిన పార్లమెంటు స్థానాలు

1) ఖమ్మం - నామా నాగేశ్వర్ రావు
2) మహబూబాబాద్ -(ఎస్టీ) మాలోత్ కవిత
3) కరీంనగర్ - బోయినపల్లి వినోద్ కుమార్
4)పెద్దపల్లి(ఎస్సీ) - కొప్పుల ఈశ్వర్
5) మహబూబ్ నగర్ - మన్నె శ్రీనివాస్ రెడ్డి
6) చేవెళ్ల -కాసాని జ్ఞానేశ్వర్
7) వరంగల్ (ఎస్సీ)-డాక్టర్ కడియం కావ్య
8 ) జహీరాబాద్ - గాలి అనిల్ కుమార్
9) నిజామాబాద్ - బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి

## అశ్లీలతతో నిండిన వెబ్‌సైట్స్, ఓటీటీ యాప్స్ బ్యాన్

న్యూఢిల్లీ, మార్చి 14 (ప్రభాత ఉదయం): 19 వెబ్‌సైట్‌లు, 18 యాప్‌లను తొలగించేసింది. ఈ ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లతో అనుబంధించబడిన 57 సోషల్ మీడియా ఖాతాలను కూడా నిలిపేసింది. 'సృజనాత్మక వ్యక్తీకరణ' ముసుగులో అశ్లీలత, అసభ్యతతో కూడిన కంటెంట్‌ను ప్రచారం చేయవద్దని కేంద్ర సమాచార ప్రసార మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ ఇప్పటికే పలుమార్లు హెచ్చరించారు. ఈ క్రమంలో అసభ్యకరమైన కంటెంట్‌ను ప్రచురించే 18 ప్లాట్‌ఫారమ్‌లను తాజాగా తొలగించినట్లు ఠాకూర్ ప్రకటించారు.

### బ్యాన్ అయిన ఓటీటీల జాబితా

Dreams Films, Neon X VIP, MoodX, Voovi, Besharams, Mojflix, Yessma, Hunters, Hot Shots VIP, Uncut Adda, Rabbit, Fugi, Tri Flicks, Xtramood, Chikooflix, X Prime, Nuefliks, Prime Play.

ఈ ప్లాట్‌ఫారమ్‌లలో ప్రసారం అవుతున్న కంటెంట్‌లో ఎక్కువ భాగం అశ్లీలతతో కూడి ఉంది. అంతే కాకుండా మహిళలను కించపరిచే విధంగా చిత్రీకరించిన పలు సినిమాలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వీటి వల్ల సమాజంలో సంబంధాలు దెబ్బతింటాయని ప్రభుత్వం అభిప్రాయపడింది. ఈ ఓటీటీ యాప్‌లను కొన్ని కోట్ల మంది డౌన్‌లోడ్ చేసకుని ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో ఈ యాప్స్‌తో పాటు వెబ్‌సైట్స్ భారత్‌లో బ్యాన్ అవుతాయి. చట్టంలోని సెక్షన్ 67, 67A, IPCలోని సెక్షన్ 292 మహిళల అసభ్య ప్రాతినిధ్యం (నిషేధం) చట్టం, 1986లోని సెక్షన్ 4ను ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా కంటెంట్ నిర్ధారించబడింది. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## టెన్త్ పరీక్షలకు నిమిషం నిబంధన ఎత్తివేత

### 5 నిమిషాల గ్రేస్ టైమ్‌కు గ్రీన్‌సిగ్నల్!

హైదరాబాద్, మార్చి 14 (ప్రభాత ఉదయం): తెలంగాణలో 2023-24 విద్యా సంవత్సారానికి గానూ మార్చి 18 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే ఈ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ఎస్ఎస్‌సీ బోర్డు విడుదల చేసింది. ఏప్రిల్ 2వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఈ క్రమంలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు విద్యాశాఖ కీలక ప్రకటన చేసింది. ఆయా తేదీల్లో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించేందుకు ఐదు నిమిషాల గ్రేస్ టైం ఇస్తున్నట్లు గురువారం ప్రకటించింది. టెన్త్ పబ్లిక్ పరీక్షలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభం అవుతాయి. తాజా నిబంధనతో 9.35 గంటల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు, సైన్స్ సబ్జెక్టులు మినహా మిగిలిన పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 వరకు, పార్ట్-1 ఫిజికల్ సైన్స్, పార్ట్-2 బయోలాజికల్ సైన్స్ పరీక్షలు జరిగే రెండు రోజులలో ఉదయం 9.30 నుంచి ఉదయం 11 గంటల వరకు జరుగుతాయి. పదో తరగతి పరీక్షలు జరిగే అన్ని రోజులలో ఐదు నిమిషాల గ్రేస్ టైమ్ ఉంటుంది. కాగా ఈ ఏడాది పరీక్షల నిర్వహణకు అధికారులు విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి అన్ని కేంద్రాల వద్ద అదనపు భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఎ కృష్ణారావు తెలిపారు. ఈ సారి రాష్ట్రవ్యాప్తంగా 2,676 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 5,08,385 మంది విద్యార్థులు పరీక్షలకు నమోదు చేసుకున్నారు. వీరిలో 2,57,952 మంది బాలురు, 2,50,433 మంది బాలికలు ఉన్నారు. పరీక్షలను పర్యవేక్షించేందుకు ఒక్కో పరీక్ష కేంద్రంలో విద్య, రెవెన్యూ శాఖల నుంచి ఒక్కో అధికారి, ఓ ఏఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లతో కూడిన 144 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. విద్యార్థులకు తప్పు ప్రశ్నపత్రాలు జారీ చేస్తే ఇన్విజిలేటర్లనే బాధ్యులుగా చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. తమ విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇన్విజిలేటర్లను పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ వివరణలు కోరాలని ఆదేశించారు. అటువంటి వారిపై తెలంగాణ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్స్ ఆఫ్ మాల్‌ప్రాక్టీసెస్ అండ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్ 1997 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.



## నేటి నుంచి టీజీ పేరుతో వాహన రిజిస్ట్రేషన్లు

### మంత్రి పొన్నం ప్రభాకర్

వరంగల్, మార్చి 14 (ప్రభాత ఉదయం): నేటి నుంచి తెలంగాణలోని వాహనాలు టీజీ పేరుతో రిజిస్ట్రేషన్ అవుతాయని రాష్ట్ర రోడ్డు రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం టీజీ గా మార్చేందుకు నిర్ణయాన్ని తీసుకుందని మంత్రి చెప్పారు. రాష్ట్ర శాసనసభ ఆమోదంతో టీజీగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి వినతి పంపామని.. కేంద్ర ప్రభుత్వం నేడు టీజీగా మార్చుకునేందుకు ఆమోదం తెలిపిందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. వరంగల్‌లో పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ ప్రజలు ఏపీకి బదులు టీజీగా రాసుకున్నారని. తెలంగాణ ఏర్పాటు తర్వాత టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా టీఎస్‌గా నిర్ణయం తీసుకుందని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం టీజీగా నిర్ణయం తీసుకుందని అన్నారు. ఆర్టీసీ కార్మికులకు 21 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చామని అన్నారు. కార్మికులు సంతోషంగా ఉన్నారని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం, సంస్థ కృషి చేస్తుందని పొన్నం చెప్పారు.

## తెలంగాణలో నేటి నుంచి ఒంటిపూట బడులు

హైదరాబాద్, మార్చి 14 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు నేటి నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు నిర్వహించాలని చెప్పింది. ప్రభుత్వ పాఠశాలలతోపాటు ఎయిడెడ్, ప్రైవేటు యాజమాన్యాలన్నీ ఈ నిబంధనలు తప్పకుండా పాటించాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని 12.30 గంటల నుంచి అమలు చేయాలని, పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని అందించిన తర్వాతే ఇంటికి పంపించాలని నిర్దే శించింది. పదోతరగతి పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానుండటంతో పరీక్షా కేంద్రాలుగా ఉన్న స్కూళ్లను మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 5 గంటల వరకు నిర్వహించాలని చెప్పింది. 2023-24 విద్యా సంవత్సరానికి ఏప్రిల్ 23వ తేదీ పాఠశాలలకు చివరి పని దినంగా విద్యాశాఖ నిర్దేశించింది. దీంతో అప్పటివరకు ఒంటిపూట బడులే నిర్వహిస్తారు. రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు ఈ సమాచారాన్ని పంపాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

## డీఎస్సీకి ముందే టెట్

మొదటి పేజీ తరువాయి...

నిర్వహించాలని గురువారం విద్యా శాఖ కమిషనర్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 3 లక్షల మంది అభ్యర్థులకు లబ్ధి చేకూరనుంది. దీంతో త్వరలో టెట్ నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యాశాఖ జారీ చేసే అవకాశం ఉంది. టెట్ నిర్వహణ ద్వారా వీలైనంత ఎక్కువ మందికి డీఎస్సీ రాసే అవకాశం కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం తాజాగా 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ 2024 నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే డీఎస్సీ ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ కూడా ప్రారంభమైంది. మార్చి 4 నుంచి ఏప్రిల్ 2 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ కొనసాగనుంది. టెట్ నిర్వహించిన తర్వాతే డీఎస్సీ నిర్వహించాలని డీఈడీ, బీఈడీ పూర్తి చేసిన నిరుద్యోగులతోపాటు బీఆర్ఎస్ నాయకులు కూడా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌కు బహిరంగ లేఖ కూడా రాశారు. టెట్ నిర్వహించకపోవడం వల్ల అనేక మంది నిరుద్యోగులు డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే అర్హతను కోల్పోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చివరి సారిగా గతేడాది సెప్టెంబర్‌లో టెట్ నిర్వహించారు. గత డిసెంబర్‌లో డీఈడీ, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు దాదాపు 50 వేల మంది వరకు ఉన్నారని, వీరందరికీ టెట్ నిర్వహిస్తే అర్హత సాధించిన వారందరూ డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో దిగివచ్చిన రేవంత్ సర్కార్ డీఎస్సీ కంటే ముందుగానే టెట్ నిర్వహించాలని నిర్ణయించింది. తెలంగాణ డీఎస్సీ మొత్తం ఉద్యోగాల్లో 2,629 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 727 భాషా పండితులు పోస్టులు, 182 పీఈటీ పోస్టులు, 6,508 ఎస్జీటీ పోస్టులు, స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి 220 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 796 ఎస్జీటీ పోస్టులు ఉన్నాయి. అత్యధిక పోస్టులు హైదరాబాద్‌లో 878 ఉన్నాయి. ఆ తర్వాత నల్గొండ జిల్లాలో 605 పోస్టులు, నిజామాబాద్‌లో 601 పోస్టులు, ఖమ్మంలో 757 పోస్టులు, సంగారెడ్డిలో 551 పోస్టులు, కామారెడ్డిలో 506 పోస్టులు ఉన్నాయి.

## ఎన్నికల వేళ పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గింపు



న్యూఢిల్లీ, మార్చి 14 (ప్రభాత ఉదయం):సార్వత్రిక ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు గుడ్‌న్యూస్ చెప్పింది. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తూ వాహనదారులకు తీపి కబురు అందించింది. ఈ మేరకు కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరీ ట్విటర్ వేదికగా వెల్లడించారు. తగ్గిన ఇంధన ధరలు రేపటి నుంచి అమల్లోకి వస్తాయని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

## తెలంగాణలో బిజెపి అత్యధిక స్థానాల్లో భారీ మెజారిటీతో గెలుపు ఖాయం

### కొండా విశ్వేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 14(ప్రభాత ఉదయం) రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో ప్రజలు బిజెపిని గెలిపించి మొదటి స్థానంలో నిల్పడం ఖాయమని చేవెళ్ల బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తమ పార్టీ నేత, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలవడంపై బీజేపీ చేవెళ్ల లోక్ సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి స్పందించారు. ముఖ్యమంత్రి తమ పార్టీ నేతను వ్యక్తిగతంగా కలిసి ఉండవచ్చునన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... జితేందర్ రెడ్డి బీజేపీలోనే కొనసాగుతారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఖమ్మం, హైదరాబాద్ పార్లమెంట్ సీట్లను తాము గెలిచినా ఆశ్చర్యం లేదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తాము 12 లోక్ సభ స్థానాలకు పైగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. సీఏఏ ముస్లింలకు వ్యతిరేకమనేది కేవలం వట్టి ప్రచారమేనని వ్యాఖ్యానించారు. ముస్లింలు బీజేపీకి వ్యతిరేకంగా లేరని, చేవెళ్లలో ముస్లింలు అందరూ బీజేపీకే వేస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా వచ్చేసరికి బీజేపీ తొలి విడత ప్రచారం పూర్తి చేసిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అనేది కేవలం ప్రచారమేనని తెలిపారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి పని చేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. చేవెళ్ల పరిధిలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లోని కీలక నేతలు బీజేపీలో చేరనున్నారని తెలిపారు. దేశ ప్రజలు ప్రధాని మోదీనే నమ్ముతున్నట్లు చెప్పారు. ఏ వర్గాన్ని బీజేపీ.. ఓటు బ్యాంక్‌గా చూడటం లేదన్నారు. చేవెళ్లకు మెట్రో రైలు తీసుకురావటానికి కృషి చేస్తానని తెలిపారు.



# సహకార సంఘాలు పటిష్టంగా ఉన్నప్పుడే రైతుకు మేలు

## డాక్టర్ ఎస్ ఎల్ ఎన్ టి శ్రీనివాస్

### శ్రీకాకుళం కలెక్టర్ ను కలిసిన శ్రీనివాస్



హైదరాబాద్, మార్చి 19(ప్రభాత ఉదయం) కేంద్రీయ సహకార బ్యాంకు శ్రీకాకుళం ఆవరణలో నిర్వహించబడిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అవగాహన సదస్సులో భారత ప్రభుత్వ అధ్వర్యంలోని కేంద్ర సహకార శాఖ ఎన్ ఎస్ ఎస్ ఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా నిర్వహించబడిన ఈ సదస్సులో ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ...సహకార సంఘముల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న విధానములు గురించి తెలియజేయడం జరిగినది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... సహకార రంగాన్ని బలోపేతం చేయటానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించినారు.ఇందులో భాగముగా వివిధ రంగాల నిపుణులతో కమిటీలు ఏర్పాటు చేసి సహకార వ్యవస్థ లో వున్న బలహీనతలని లోపాలని సరిదిద్ది సహకార సంస్థల ఆదాయ వనరులు పెంచుతూ వాటిని ఆర్థిక స్వావలంబన దిశగా ఒక నూతన కేంద్రీయ సహకార విధానాన్ని రూపొదిం చే వీలుగా మాజీ కేంద్ర మంత్రి సురేష్ ప్రభు ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఆ యొక్క కమిటీ ఆలోచన ఏమిటంటే ఒక స్వేచ్ఛాయుత వాతావరణం లో ఏ విధమైన రాజకీయ వత్తిడి గానీ లేకుండా సహకార వ్యవస్థ వనరులు దృష్టిలో పెట్టుకొని సోఫా సభ్యులు సేవలు ఏ విధంగా అందించగలిగితే వారి యొక్క ఆర్థిక ఆర్థిక స్థాయి పెరుగుతుంది తద్వారా వాళ్ల కాళ్ళ మీద వాళ్లు నిలబడే స్టేజికి సహకార సంఘాలను తీసుకురావడం తద్వారా సహకార వ్యవస్థలో వ్యవసాయ ఉత్పత్తులు పెంచే విధంగా పరిరక్షించే విధంగా కొత్త పథకాలు ద్వారా సంస్థలను బలోపేతం చేయటం ముఖ్యంగా నూతన వ్యవస్థను సహకార రంగంలోనే దేశియ స్థాయిలోనే పరీక్షించే పరిరక్షించాలని ఆలోచనతో రకరకాల కొత్త పథకాలతో కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల ఆలోచనలు చేసి సహకార రంగాన్ని దేశీ స్థాయిలోని ఒక డేటా బేస్ ను ఏర్పాటు చేయటం జరిగింది .ఇందులో 264000 సహకార సంఘాలు నమోదు చేసుకోవడం జరిగింది. అలాగే ఈ సహకార వ్యవస్థను బలోపేతం చేయడానికి వీలుగా కేంద్ర బడ్జెట్లో లక్ష 67 కోట్లు రూపాయలు కేటాయించడం జరిగింది . దేశస్థాయిలో 2 లక్షల మల్టీపర్పస్ సొసైటీలను ఏర్పాటు చేయడం రానున్న ఐదు సంవత్సరముల కాలంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం జరిగింది. వీటి ద్వారా రకరకాల సేవలందించేందుకు వీలుగా సహకార చట్టాము లోను , సహకార సంఘముల బైలాస్ ను మార్పులు చేసుకునే విధముగా కేంద్ర ప్రభుత్వం మోడల్ బైలాసును సూచించడం అయినది. నూతన విధానం తద్వారా ముఖ్యంగా మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంగీకారం తెలపడం జరిగింది సహకార సంఘాల బలో పెతం కోసం వీటి యొక్క ఆదాయ వనరులు పెంచడం కోసం కొన్ని కేంద్ర పథకాలను ఏర్పాటు చేయడం జరిగింది ముఖ్యంగా ప్రాథమిక సహకార సంఘాలకు గోదాములు నిర్మించడం వ్యాపారానికి అనుకూలమైన మౌలిక సదుపాయములుగా కల్పించడం మరియు కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా సహకార సంఘాలను మార్పు చేయటం తద్వారా రైతులకు తక్కువ ధరకు ఎరువులను అందించటం కోసం మార్గదర్శకాలను రూపొందించారు. వ్యవసాయ ఉత్పత్తులను రైతులుకు తగినంత మద్దతు ధర కల్పించడం కోసం కృషి చేయడం జరుగుతుంది . వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునే విధంగా తగు ఏర్పాట్లు చేయడం జరుగుతుంది మరియు ఈ నూతన విధానంలో భాగంగా మునివేయబడిన చెక్కర కర్మాగారాలను తిరిగి తెరిపించడం వాటి కార్యకలాపాలను తిరిగి ప్రారంభించడం కోసం కృషి చేయడం జరుగుతుంది ఇందు కోసం ఎన్ సి డి సి ద్వారా పదివేల కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందిరాబోయే రోజుల్లో ప్రపంచంలోని తొలిసారిగా నేషనల్ కోపరేటివ్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు కృషి చేయడం జరుగుతుంది దీని ద్వారా పాలవర్గంలోనూ మరియు సిబ్బంది లోను నైపుణ్యత సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేయడం జరిగింది అన్నారు. తద్వారా వ్యవస్థను బలోపేతం చేయడానికి అవకాశం ఉంటుంది అంతేకాకుండా సహకార సంస్థలు బలపడ్డానికి కృషి చేయడం జరుగుతుంది ఇందులో భాగంగా రాబోయే మూడు రోజులు జిల్లాలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ కమిషనర్ సూచన మేరకు సహకార వ్యవస్థలో ఉండే ముఖ్యంగా బలహీనంగా ఉన్న సహకార సంఘాలకు ఎంపిక చేసి వాటిని బలోపేతం చేసే విధంగా కృషి చేయడం జరుగుతుంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘముల ద్వారా రైతులకు సకాలంలో రుణాలు అందించుటకు వివిధ రకాల సేవలు అందించుటకు వీలుగా పూర్తిస్థాయిలో కమిటీ కరణకు కేంద్ర ప్రభుత్వం 2500 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. దీనికి సంబంధించి నాబార్డ్ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరమునకు 416 కోట్లు నిధులు ఇవ్వడం జరిగింది. 63 వేల సంఘమునకు కంప్యూటీకరణ చేయడం జరిగినది.నాబార్డ్ ద్వారా సంఘ ఆర్థిక లావాదేవీలు లలో పారదర్శకత పాటించడానికి అవకాశం ఉంటుంది. జాతీయస్థాయిలో ఎగుమతులు , విత్తనాలు జాతీయ సహకార సమైక్యాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం జరిగింది.గవర్నమెంట్ ఎలక్ట్రానిక్ మార్కెటింగ్ పోర్టల్ లో పిఎసిఎస్ నమోదు చేసుకోవడానికి అర్హత కల్పించడం జరిగినది. పిఎసిఎస్ ఆదాయ వనరులు పెంచుకోవడానికి వీలుగా పెట్రోల్ బంకులు, గ్యాస్ డీలర్ షిప్ తీసుకోవడానికి వీలుగా వారికి అర్హతను కల్పించడం జరిగినది. ఉత్పాదక రంగంలో ఉండే సహకార సంస్థలకు పన్ను రాయితీలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడమైనది. (30% - 15 %)ఈ కార్యక్రమంలో శ్రీ సుబ్బారావు జిల్లా సహకార అధికారి, జిల్లా సహకార ఆడిట్ ఆఫీసర్, డిసిసిబి ముఖ్య కార్యనిర్వహణ అధికారి, డిసిసిబి జనరల్ మేనేజర్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులు, ముఖ్య కార్య నిర్వహణ అధికారులు మరియు సహకార శాఖ అధికారులు పాల్గొని యున్నారు.



పాఠశాలను సందర్శించిన నవయువ యూత్ క్లబ్ ప్రతి నిధులు

## బాబుల్ రెడ్డి నగర్ ప్రాథమిక పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

రాజేంద్రనగర్, మార్చి,14(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో బాబుల్ రెడ్డి నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి , ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డిలు పాఠశాలను సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ అనిత పాఠశాల సమస్యలు వివరించారు. ఇందులో సుమారు 250 మంది బాలబాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలల్లో మూత్రశాలల పరిస్థి తి అధ్వానంగా ఉందన్నారు. బోరు చెడిపోవడంతో నీళ్ల లేక ఇబ్బందులు పడుతున్నారు. నీటి సరఫరా లేకపోవడం, పరిశుభ్రంగా లేకపోవడం వంటి స్థితిలో ఉన్నాయి. దీంతో విద్యార్థులు సరైన సమయంలో కాలకృత్యాలు తీర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు మరుగుదొడ్లకు వెళ్లాలంటే చాలీచాలని నీటితో ఇబ్బందులు పడుతున్నారు. నీటి కష్టాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రానున్న వేసవిలో నీటి కష్టాలు మరింత పెరిగే అవకాశం ఉందంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని నవయువ యూత్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి కోరుచున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల అభివృద్ధికి మౌలిక వసతులు కల్పించాలన్నారు.



## చేవెళ్లలో భారీ మెజార్టీతో కాషాయం జెండా ఎగరాలే

### అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి

### పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి...

రాజేంద్రనగర్,మార్చి13(ప్రభాత ఉదయం) రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.బుధవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం కోకాపేట్ లోని కుంకుమ కన్వెన్షన్ హాల్ లో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి అధ్యక్షతన పార్లమెంట్ కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ కోర్ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల పార్లమెంట్అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు బొక్క బాల్ రెడ్డి పాల్గొని దిశ నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా బొక్క బాల్ రెడ్డి మాట్లాడుతూ...బూత్ స్థాయి కార్యకర్తలు,అధ్యక్షులు,శక్తి కేంద్రాల ఇన్చార్జిల సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు.తెలంగాణలో బీజేపీని ప్రజలు ఆదరిస్తున్నారని సూచించారు.ప్రధానిగా మళ్లీ నరేంద్రమోడీ బాధ్యతలు చేపడుతారని చెప్పారు.చేవెళ్లలో బీజేపీని గెలిపించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ప్రపంచలోనే అతి శక్తివంతమైన నాయకుడు ప్రధాని నరేంద్రమోదీ అన్నారు.అభివృద్ధి చెందిన దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయన్నారు.పదేళ్లలో దేశంలో అవినీతి రహిత పాలన అందిస్తూ బీజేపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.అన్ని మతాలను మెప్పించి అయోధ్యలో రామమందిరం నిర్మించి 140 కోట్ల మంది భారతీయులకు అంకితం చేసిన ఘనత ప్రధానికే దక్కుతుందన్నారు.వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో 400 ఎంపీ సీట్లు బీజేపీ టార్గెట్ అని అన్నారు.తెలంగాణలో 17 ఎంపీ సీట్లు గెలిచే విధంగా ప్రతీ కార్యకర్త పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలని కోరారు.రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు సైతం బీజేపీ పార్టీకి ఓటు వేస్తామని చెబుతున్నారని తెలిపారు.చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్రెడ్డి ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే నాయకుడని బొక్క నరసింహారెడ్డి కొనియాడారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి,వికారాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షుడు మాధవరెడ్డి,మాజీ ఎమ్మెల్యే రత్నం,మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,రాష్ట్ర కౌన్సిల్ నెంబర్,జిల్లా ప్రధాన కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.



కంపెనీ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

## రెండు వ్రేళ్ళు తెగిపోయిన కార్మికునికి న్యాయం చేయాలి



రెండు వేళ్ళు తెగిపోయిన దృశ్యం

బుద్వేల్, మార్చి14(ప్రభాత ఉదయం): శ్రీరామ్ కాలనీ లో గల శ్రీవారి స్పైసెస్ ఫుడ్స్ లో యంత్రం లో పడి కుడి చేతి రెండు వ్రేళ్ళు సగం వరకు తెగిపోయిన కార్మికునికి న్యాయం చేయాలని సీ ఐ టీ యు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గురువారం బాధితునితో కలసి కంపెనీ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కాటేదాన్ ఇండస్ట్రియల్ ఏరియా కన్వీనర్ భాస్కర్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బచ్చలకూర స్వామి, కోశాధికారి ఎన్.పార్వతి లు పాల్గొన్నారు. మహారాష్ట్ర రాష్ట్రం నుండి వలస వచ్చి మసాలాలు మిర్చి పొడి తదితర ఉత్పత్తులు చేస్తున్నటువంటి శ్రీవారి స్పైసెస్ ఫుడ్ లిమిటెడ్ పరిశ్రమలో పనిచేస్తున్నటువంటి కార్మికుడు శేఖర్ విధులు నిర్వహిస్తున్న సందర్భంలో కుడి చేయి చూపుడు వేలు దాని పక్కన వేలు రెండు ఇంచుల వరకు పరిశ్రమ మిషన్లో పడి కట్ అయిపోయి తీవ్ర రక్తస్రావన జరగడం జరిగిందని గుర్తు చేశారు. పరిశ్రమ యజమాని కేవలం ప్రథమ చికిత్స చేయించడం జరిగిందని తెలిపారు. పరిశ్రమలో ఎలాంటి సేఫ్టీ పరికరాలు వాడకుండా ఇలా కార్మికుల ప్రాణాలు పైనే చెలగాటమాడుతున్నారన్నారు. నాకు వర్కింగ్ కాంపొజిషన్ కింద చట్టపరంగా రావాల్సినటువంటి బెనిఫిట్స్ ఇతర వసతులు కల్పించాలని పరిశ్రమ యజమానిని కోరగా దిక్కున చోట చెప్పుకో అని సీఐటీయూ నాయకుల సమక్షంలోనే కార్మికుడిని బెదిరించడం జరిగిందని తెలిపారు. వెంటనే పరిశ్రమ యజమానిపై పోలీసులు లేబర్ అధికారులు, ఫుడ్ ఇన్స్పెక్టర్ తదితర అధికారులు చర్యలు తీసుకుని కార్మికుని కుటుంబానికి న్యాయం చేయవలసిందిగా పరిశ్రమ గేటు దగ్గర నిరసన కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గాయపడ్డ కార్మికుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## సిఐటియు ఆధ్వర్యంలో కార్ల్ మార్క్స్ 141 వర్ధంతి

రాజేంద్రనగర్, మార్చి14(ప్రభాత ఉదయం) సిఐటియు రాజేంద్రనగర్ మండల కన్వీనర్ సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్ర కుమార్ అధ్యక్షతన కార్ల్ మార్క్స్ 141 వర్ధంతి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సదస్సు కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ...కార్ల్ మార్క్స్ మానవ చారిత్రలోఅత్యంత ప్రభావ శిలమైనఒకరగా ఆయన పేరొందరు. ఆయన కృషి సిద్ధాంతంఅటు ప్రశంసలు , ఇటు విమర్శలు విస్తృతంగా పొందింది. అర్థశాస్త్రములు ఆయన కృషి శ్రమ గురించి, దాని పెట్టుబడుకున్న సంబంధం గురించి ప్రస్తుత అవగహనకి సంబంధమైన ఆర్థిక ఆలోచనకి పునాదిగా నిలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఎందరో మేధావులు, కార్మిక సంఘాలు కళాకారులు, రాజకీయ పార్టీలు మార్క్స ఆలోచనాదార, ప్రభావితులయ్యారు.చాలామంది తన ఆలోచనలు స్వీకరించడం, మార్చుకోవడమో చేశారు. మార్క్స్ ని సామాన్యంగా ఆధునిక సామాజిక శాస్త్ర నిర్మాతల్లో ఒకరిగా పేర్కొంటారు. మార్క్స్ మరణించే వరకు ఆయన భావాలు వ్యాప్తి చెందకపోయినా. ఆయన మరణ అనంతరం వాటి ప్రభావం విస్తరించింది. రష్యా విప్లవం మొదలుకుని ప్రపంచవ్యాప్తంగా అనేక విప్లవలు మార్క్సిజ%శీ% పునాదిగా చేసినట్టు ప్రకటించుకున్నాయి.20 శతాబ్దిలో అనేక దేశాలు మార్క్స్ స్ట దేశాలుగా తమను ప్రకటించుకున్నాయి వ్లాదిమిర్ లెనిన్, మావో జాడుంగ్, ఫిడెల్ కాస్ట్రో సాల్వరాడ్ అలె%శీ%డే,జోసిప్ బ్రోజ్ టిట్టో, క్వామే క్రుమా, సహ 20వ శతాబ్దానికి చెందిన ప్రముఖ నాయకులు మార్క్స్ తమపై గాఢ ప్రభావం చూపాడని పేర్కొన్నారు ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జి కురుమయ్య .. సిఐటియు రాజేంద్రనగర్ మండల కన్వినింగ్ కమిటీ నాయకులు పార్వతి.బజ్జలకూర స్వామి . భాస్కర్. ప్రవీణ్. సచిన్. బాలరాజు. లక్ష్మణ్ ల తో పాటు మండల కమిటీ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.



ముస్లిం సోదరులకు ఖర్జూర పండ్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## సులేమాన్ నగర్ లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, మార్చి14(ప్రభాత ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఎంఎం పహడి, సులేమాన్ నగర్ లో గురువారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ విందులో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కఠోర దీక్ష చేస్తున్న ముస్లిం సోదరులకు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని ఖర్జూర పండ్లను తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... ఇఫ్తార్ విందులో మతసామరస్యానికి ప్రత్యేకగా నిలుస్తాయన్నారు. ఈ ఇఫ్తార్ విందులో బి ఆర్ ఎస్ మైనారిటీ నాయకులు మూర్తుజ, ముజామిల్ అహ్మద్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.



జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న ప్రేమ్ కుమార్

## ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం

కూకట్పల్లి,మార్చి14 (ప్రభాత ఉదయం) ఘనంగా జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవం...జెండాను ఆవిష్కరించి నముమ్మారెడ్డి జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సదర్భంగా కూకట్ పల్లి 5వ ఫేస్ జనసేన పార్టీ కార్యాలయం లో మరియు కేబీహెచ్బీ కాలనీ 3వ ఫేస్ టెంపుల్ బస్ స్టాప్ లో కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యుల కష్టాలను తీర్చటానికి పుట్టిన పార్టీ జనసేన పార్టీ అన్నారు. నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసమే ఏర్పడినటువంటి పార్టీ జనసేన పార్టీ అని అన్నారు. ప్రజల కోసం నిలబడుతూ సమస్యలు పరిష్కారానికి తమ వంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు.అనంతరం కేక్ కటింగ్ , మొక్కల పంపిణీ కార్యక్రమం , అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నియోజక వర్గ జనసేన పార్టీ డివిజన్ నాయకులు, కోఆర్డినేటర్లు , మహిళలు, జన సైనికులు పాల్గొన్నారు.



## మర్యాద పూర్వకంగా జివిఆర్ని కలిసిన ఆస్బెస్టాస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్

కూకట్పల్లి,మార్చి14 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్ పల్లి డివిజన్ లోని ఆస్బెస్టాస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కూకట్ పల్లి భాగ్యనగర్ కాలనీ లోని గొట్టిముక్కల వెంకటేశ్వర రావు ను తన కార్యాలయం లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువా తో సత్కరించి కాలనీ లో అభివృద్ధికి సంబంధించి ఎలాంటి పని అయిన శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి జగదీశ్వర్ గౌడ్ తో మాట్లాడి కాలనీ అభివృద్ధికి నావంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రెసిడెంట్ నరేష్, వైస్ ప్రెసిడెంట్ . నర్సింహులు,జనరల్ సెక్రెటరీ మహమ్మద్ హుస్సేన్, జాయింట్ సెక్రటరీ ఎంఏ రఫిక్, ట్రెజరర్ పుష్ప, మహమ్మద్ ఇసాక్, గురువారెడ్డి, హనుమంతారెడ్డి, ఎండి సిరజ్ లు పాల్గొన్నారు...



డీఆర్ఆర్ దాన్ 48 వరి రకం బ్రోచర్ ను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

## గ్లిమినో కంపెనీకి డీఆర్ఆర్ దాన్ 48 వరి విక్రయాల లైసెన్స్

బుద్వేల్, రాజేంద్రనగర్, మార్చి14 (ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ లోని భారతీయ వరి పరిశోధన సంస్థ (ఐ ఐ ఆర్ ఆర్ ) గురువారం డీ ఆర్ ఆర్ దాన్ 48 వరి రకానికి సంబంధించిన 'టెక్నాలజి లైసెన్స్'ను గ్లిమినో కంపెని, తెలంగాణ వారికి ఇచ్చింది. ఈ వరి రకం తక్కువ గ్లిసమిక్ ఇండెక్స్ ఉన్నందువల్ల టైప్-2 డయాబెటిస్ తో బాధపడే వ్యక్తులు తీసుకోడానికి అనువైనదిగా ఉంటుంది. ఈ వరి రకం, యీ గుణంతోపాటు, అధిక జింక్ కలిగి, ఎండాకు తెగులును తట్టుకునే శక్తిని. కలిగివుంది. గ్లిమినో కంపెనీ యీ లైసెన్స్ ద్వారా, దేశంలోని వివిధ ప్రాంతాలలో ఆసక్తిగల వినియోగదారులలో ఈ బియ్యాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో సహాయపడుతుంది.

## వేసవిలో నీటి కొరత లేకుండా ప్రత్యేక చర్యలు: జిఎం చంద్రశేఖర్



రాజేంద్రనగర్, మార్చి14(ప్రభాత ఉదయం) వేసవిలో నీటి సరఫరా లో ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ జలమండలి జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం బుద్వేల్ ఫిల్టర్ బెడ్ వద్ద నూతనంగా స్టీల్ ట్యాంకర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ... సర్కిల్ పరిధిలోని ప్రజలు తమ ప్రాంతాలలో నీటి సరఫరాలో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రామ్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం బిఆర్ఎస్‌దే




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి




పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి

### స్థానిక సంస్థల సమస్య లపై అవగాహన ఉంది ఎమ్మెల్సీగా అవకాశం కల్పించండి

### అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి

గద్వాల,మార్చి14(ప్రభాత ఉదయం) స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ దే విజయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రాజకీయాలలో నడిగడ్డకు ప్రత్యేక రాజకీయ చరిత్ర ఉందని గుర్తు చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో గద్వాల, అలంపూర్ అసెంబ్లీ స్థానాలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలుపు వెనుక నాయకులు, కార్యకర్తల కృషి ఉందని, ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ లో బిఆర్ఎస్ పార్టీ తరఫున బిఆర్ఎస్ అధినేత రాష్ట్ర తొలి సిఎం కెసిఆర్ బలపరిచిన అభ్యర్థిని నవీన్ కుమార్ రెడ్డి బారీ మెజారిటీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని 1455 మంది ప్రజాప్రతినిధులో బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ప్రజాప్రతినిధులు దాదాపుగా 900 మంది ఉన్నారని, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయమని అన్నారు. ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నాయకులు బిఅర్ఎస్ ప్రజా ప్రతినిధులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రలోభాలకు లొంగకుండా బిఆర్ఎస్ అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి గెలుపుకు కృషిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల పాలనలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయక ప్రజలకు మోసం చేస్తోందని విమర్శించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ....బిఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ ఆశీస్సులతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్నానని, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులుగా సమస్యలపై అవగాహన ఉందని అన్నారు. ఒక్కసారి అవకాశం కల్పిస్తే ప్రజా ప్రతినిధుల సమస్యల పైన చట్టసభలలో గళమెత్తి పరిస్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈనెల 28న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రజాప్రతినిధులు మీ అమూల్యమైన ఓటును మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఓటు వేసి వేయించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్, ఎంపీపీలు , జెడ్పీటీసీ లు కౌన్సిలర్లు ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.




కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే విజయుడు



సమావేశంలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



# రానున్న రోజుల్లో బిజెపిలోకి మరిన్ని చేరికలు ఉంటాయి

### మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి,మార్చి14 (ప్రభాత ఉదయం) పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా ఆపరేషన్ ఆకర్ష మొదలు పెట్టింది. ఇక తెలంగాణ రాష్ట్రంలోనూ బిజెపిలోకి వలసలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం కూకట్ పల్లి నియోజకవర్గం-బాలాజీ నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బట్ట అనీల్ కుమార్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి భారతీయ జనతా పార్టీ కూకట్ పల్లి అసెంబ్లీ ఇంచార్జి మాధవరం కాంతారావు సమక్షంలో భారతీయ జనతా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు, అనంతరం ఆయనకు బిజెపి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ... భారత ప్రధాని నరేంద్ర మోదీ అవలంబిస్తున్న అనేక సంస్కరణలు, వారి బలమైన నాయకత్వానికి ఆకర్షితులై పెద్ద ఎత్తున ఇతర పార్టీల నాయకులు కార్యకర్తలు బిజెపిలోకి చేరుతున్నారని, రానున్న రోజుల్లో ఈ చేరికలు మరిన్ని ఉంటాయని, అబ్ కీ బార్ 400 సౌ బార్ నినాదం సాకారం కానుందని అన్నారు. మరోసారి మోది నాయకత్వంలో భారత్ విశ్వ గురువుగా మారుతుందని ఈ సందర్భంగా కాంతారావు ధీమా వ్యక్తం చేశారు. అనంతరం బట్ట అనీల్ కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీని వీడి తిరిగి బిజెపిలోకి రావడం సొంత ఇంటికి వచ్చినంత ఆనందంగా ఉందని, దేశం కోసం, ధర్మం కోసం మోదీ నాయకత్వంలో పనిచస్తూ భరతమాత సేవలో తరించేందుకు బిజెపిలో చేరానని ఈ సందర్భంగా అనీల్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు వినోద్ కుమార్ గౌడ్, బిజెపి నాయకులు, షేక్ షాజహాన్, బాల నారాయణ, సంతోష్, హరి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.




# రామ్ దేవ్ రావు హాస్పిటల్‌లో పంచ కిడ్నీ దినోత్సవం

### కిడ్నీ పెషెంట్ కు కుటుంబ సభ్యులు సహకారం చాలా అవసరం....

### వారితోనే డయలైసిస్ పేషెంట్స్ మనుగడ సాగించగలుగుతారు..

### డాక్టర్ యోబు సీఈఓ..

కూకట్‌పల్లి,మార్చి14 (ప్రభాత ఉదయం) ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామ్ దేవ్ రావు హాస్పిటల్ నందు వైద్యులు, రోగులు, అటెండర్లుతో కలిసి ప్రపంచ కిడ్ని దినోత్సవం జరిపారు. ఈ కిడ్నీ దినోత్సవాన్నిమెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్ ఆద్వర్యం లో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఛాయ దేవి రామ్ దేవ్ రావు గైనిక్ హెడ్ మాంట్లాడుతూ ఈ కిడ్నీ రోగులు ముందుగా జాగ్రత్తలు తీసుకుంటే ఈ కిడ్నీ సమస్యలు రాకుండా ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా డైటిషియన్ అఖిల మాట్లాడుతూ కిడ్నీ రోగులు ఎటువంటి డైట్ తీసకోవాలి అని వివరించారు. వారి టీమ్ మెంబెర్ అయిన గ్లోరి ఎవాంజలిన్, సంజన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ ప్రజెంటేషన్ చాలా ఉపయోగ కరంగా ఉంది అని పెషెంట్, పెషెంట్ కుటుంబ సభ్యులు అందరూ తెలిపారు. ఈ సంద్భంగా నర్సింగ్ సుపరెండెంట్ మేరి మేడం మాట్లాడుతు దయాలిసిస్ రోగులు యొక్క నర్సింగ్ కేర్ ముఖ్య ఉద్యేశ్యం గురించి మాట్లాడారు. దయాలిసిస్ గురించి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇది కూడా చాల ఉపయోగ కరంగా ఉంది అని పలువురు ప్రశంసించారు. సీఈఓ డాక్టర్ యోబు మాట్లాడుతూ కిడ్నీ పెషెంట్ కుటుంబ సభ్యులు సహకారం చాలా అవసరం అని వారి సహకారం తోనే దయలైసిస్ పేషెంట్స్ మనుగడ సాగించగలుగుతారు అని వివరించారు. ఈ కార్యక్రమం లో అఖిల డైటీష్టియన్ సిస్టర్ శోభ ఐసియు ఇచార్చి, మెడికల్ అధికారి డాక్టర్ రంగనాథ్ , డాక్టర్ లావణ్య, డాక్టర్ రాఘువేంద్ర, భగవాన్ మహావీర్ చైల్డ్ సెంటర్, స్టాఫ్ అడ్మినిస్ట్రేటివ్ మెంబెర్స్, ఎబెల్, కృష్ణ, స్వప్న, పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసారు.



బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నరసింహ గౌడ్ పాడి మోస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డి

### బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు నర్సింహులు గౌడ్ మృతి

# పార్టీకి తీరని లోటు

### మాజీ ఎమ్మెల్యే ఏ వి ఆర్

కొత్తకోట, మార్చి14(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం అప్పరాల గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహ గౌడ్ రోడ్డు ప్రమాదంలో మరణించారు . విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అప్పరాల గ్రామానికి చేరుకొని ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అంతిమయాత్రలో మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర రెడ్డి నరసింహ గౌడ్ పాడెను.




సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి

# ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభను విజయవంతం చేద్దాం

### బిజెపి జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి

గద్వాల,మార్చి14(ప్రభాత ఉదయం) రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 16న నాగర్ కర్నూల్ జిల్లాలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించు ప్రధాని నరేంద్రమోడీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం గద్వాల పట్టణంలో నిర్వహించిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 16వ తేదీ శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాగర్ కర్నూలు జిల్లా కేంద్రానికి పార్లమెంటు ఎన్నికల ప్రచార నిమిత్తం రావడం జరుగుతుందన్నారు. గద్వాల జిల్లా నుండి 20,000 వేలమంది ఈ సభకు తరలి వేళ్లే విధంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ గెలుపు తథ్యమని దానిలో భాగంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్నటువంటి నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్ ప్రసాద్ ను, మహబూబ్ నగర్ పార్లమెంట్ అభ్యర్థి నేత బిజెపి జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణమ్మను గెలిపించుకొని ప్రధాని నరేంద్ర మోడీకి గిఫ్ట్ ఇద్దామని సూచించారు. దేశంలో గెలవబోయే 370 స్థానాలలో మన రెండు స్థానాలు కూడా తప్పకుండా భారీ మెజార్టీతో గెలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రతి పోలింగ్ బూత్ నుండి 30 మంది కార్యకర్తలకు తగ్గకుండా బహిరంగ సభకు తరలిరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, మున్సిపల్ ఫోర్ లీడర్ కుమ్మరి శ్రీను,ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, జిల్లా ఐటి సెల్ కన్వీనర్ చిత్తారి కిరణ్, నాయకులు రజక నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



ఈ శ్రమ పథకం పై అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

# ఈశ్రమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గద్వాల,మార్చి14(ప్రభాత ఉదయం)అసంఘటిత రంగంలో ఉన్న శ్రామికుల కుటుంబ భద్రతకు ప్రవేశపెట్టిన ఈశ్రమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆశ్రయ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు తెలిపారు. గురువారం గద్వాల పట్టణ పరిధిలోని తూర్పు దౌదర్ పల్లిలో ఆశ్రయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ శ్రమ్ క్యాంపు నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ లేబర్ కార్డు ఈ శ్రమ్ కార్డ్, సుకన్య యోజన స్కీం, జేజేవై స్కీముల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఎండి బషీర్, సిబ్బంది ప్రతాప్, కాలనీ వాసులు పాల్గొన్నారు.




# ఆధునిక ప్రపంచానికి కారల్ మార్క్స్ సుపరిచితుడు

గద్వాల,మార్చి14(ప్రభాత ఉదయం)ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక రకాల ఆర్థిక రాజకీయ సామాజిక సంక్షోభాలకు పరిష్కారకర్తగా ఆధునిక ప్రపంచానికి కారల్ మార్క్స్ సుపరిచితుడని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ. వెంకటస్వామి అన్నారు. కారల్ మార్క్స్ 141 వ వర్ధంతి సందర్భంగా గురువారం గద్వాల పట్టణంలోని సిపిఎం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారల్ మార్క్స్ స్ఫూర్తితో ఆర్థిక రాజకీయ సామాజిక అంతరాలు లేని సమ సమాజం కోసం జరిగే పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి నరసింహ,ఉప్పేర్ నరసింహ నాయకులు ఆంజనేయులు, నర్సింహ,వెంకటన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



జగదీశ్వర్ గౌడ్ కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

# శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తాం

### వి.జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి, మార్చి 14 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని ఆస్బె స్టాస్ హిల్స్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఎన్నుకోబడిన కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఆయన శాలవతో సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుండి ప్రజల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తుందని, కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నరేష్, నర్సిములు,మహమ్మద్ హుస్సేన్,ఎం.ఏ. రఫిక్,పుష్ప,మహమ్మద్ ఇసాక్,మెహ్రాజ్, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.